# సత్యవాక్య

## The Word of Truth

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్య వాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్య మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి !!

**SATYAVANI**
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA–533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగి నప్పుడు మీ సత్యవాక్య నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం !!

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్, కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్ట్ బాక్స్ - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ :
జె. సి. ఛోట్

మేనేజింగ్ ఎడిటర్ :
జాషువా గూటం

సంచిక **3** అక్టోబరు **1983** సంపుటి **4**


# సంపాదకీయము

## పేతురు యొక్క నాయకత్వము

*( The Leadership of Peter )*

మనము పేతురును గూర్చి తలంచునపుడు అతడు క్రీస్తును ఎరుగనని బొంకిన సంఘటనను జ్ఞాపకం చేసుకొంటాం. ఆ సందర్భములో అతడు అపరాధము చేసియున్నను, అతడెలాంటి మనిషో తదుపరి నిరూపించుకొన్నాడు. అతడు ప్రభువు వైపు తిరుగుటలో ప్రదర్శించిన సామర్థ్యము, అతడు నాయకులకు నాయకునిగా అగుటలో వెలుగుపరచిన శక్తిని బట్టి మన మనస్సుల్లో ముద్ర వేసింది.

మత్తయి 4:18-22 లో జాలరులైన పేతురు, అంద్రెయ అను ఇరువురు సోదరులు గలిలయ సముద్రములో తమ వలలు విసురుచుండుట యేసు చూసినట్లు చదువగలము. యేసు వారితో నన్ను వెంబడించుమని చెప్పి, మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేస్తానని వారికి వాగ్దానము చేసాడు. వారు తక్షణమే తమ వలలు వదలి ఆయనను వెంబడించారు. పిమ్మట ఆయన యాకోబు యోహాను అను ఇద్దరు

సోదరులు తమ వలలు ఆరబెట్టుకొనుట చూసాడు. ఆయన వాళ్ళ పిలువగా, వారు కూడ ఆయనను వెంబడించారు. వారు క్రీస్తు పిలుపునకు వెంటనే లోబడుటకు గల కారణమేమని కొందరు ప్రశ్నిస్తారు. సౌలుకు క్రీస్తు ప్రత్యక్షమైన సంఘటనను అది మనకు జ్ఞప్తి చేస్తుంది. అతడు క్రీస్తు అనుచరులను హింసించుచుండిన వాడైనను ప్రభువు అతనికి ప్రత్యక్షమైనప్పుడు, "ప్రభువా నేనేమి చేయవలెను?" అని సౌలు ప్రశ్నించాడు. క్రీస్తు నాయకత్వాన్ని శంకించే ఒక్క మాట నను అనలేదు. క్రీస్తు అబద్ధికుడు మోసగాడు కాడు గాని ఆయన దేవుని కుమారుడని ఆ క్షణములో గ్రహించాడు. అట్లనే పేతురును అంద్రెయను యాకోబును యోహానును ఇతరులను క్రీస్తు ఆహ్వానించినపుడు ఆయన మనుష్యునికంటె ఉన్నతుడని వారు గుర్తించారు. ఆయన అధికారము గల్గినవానిలా మాట్లాడాడు. మును పెన్నడు ఆయనవలె ఎవరును మాట్లాడి యుండలేదు. ఆయన వెంబడింపబడదగినవాడని నమ్మి ఆయనకు చేరువయ్యారు. వారు మార్పు చేయబడినవారు. వారు ఏమాత్రము మునుపటి వంటివారు కారు.

వీరు వృత్తిరీత్యా జాలరులు. వారు గలిలయులు. గలిలయ సముద్రములో చేపలు పట్టేవారు. వారు పేదవారు, పామరులు. ఐనను పెంతెకొస్తు దినమున యెరూషలేములో పేతురు, అపొస్తలులు, నిజానికి మొదటిసారి సువార్త ప్రకటించిన సంఘటనను జ్ఞాపకము చేసికొన్నట్లయితే, ప్రభువు వారికి పరిశుద్ధాత్మ శక్తిని ప్రసాదించెను గనుక మిగిలిన వాటితో బాటు వారు అన్యభాషలు మాట్లాడే సామర్థ్యము పొందారు. అక్కడున్న ప్రజలు దీన్నిబట్టి విస్మయమొందారు. ఎందుకంటే ఈ నిర్భాగ్యులు నిరక్షరాస్యులైన గలిలయులని వారికి ఎరుకయే. వారు క్రీస్తును వెంబడించుట వలన వారి జీవితాలలో గొప్ప మార్పు సంభవించింది. ఆయన వారిని నరులను పట్టు జాలరులుగా చేసాడు. వారు ఎలా బోధించాలో, ఎలా ప్రాబల్యము సంపాదించాలో, శ్రీ

పురుషులను ఆయన్ని వెంబడించేలా చేయుట ఎలాగో ఆయన నేర్పించాడు.

బీదవారును విద్యావిహీనులైన వారిలో నాయకత్వమునకు తగిన శక్తిని చూచి, ఆయన మృతినొందిన తరువాత ఆయన పనిని కొనసాగించునట్లు వారిని తీర్చిదిద్ది, సన్నద్ధులను చేసాడు. అపొస్తలు లందరు మహానాయకులు కావలసియుండిరి గాని పేతురు మాత్రము నాయకులకు నాయకుడవ్వవలసి యుండెనని లేఖనములంతటిలో కన్పడు చున్నది. పేతురుయొక్క అద్వితీయమైన నాయకత్వాన్ని కొందరు అపార్థము చేసికొన్నారు. మరియు అతనిని సంఘపునాదిగాను, శిరస్సు గాను చేయుటకు క్రీస్తు సంకల్పించాడని వారు ఊహించారు. పేతురు అలాగ అయ్యే ఆస్కారమే లేదు. అతడు గొప్ప మనిషి, నాయకులకు నాయకుడు. అపొస్తలులందరి తరపున తరచు మాట్లాడినవాడు, సంఘములో ఒక పెద్ద. అయినప్పటికీ అతడు పొరపాట్లు చేసిన మాన వుడే. కాని ప్రభువు నొద్దకు తిరిగి రాగల్గి, ఆయన కొరకు ఘన కార్యాలు సాధించినవాడు.

పేతురుకు సీమోను (మత్తయి 10:2), కేఫా (1 కొరింథీ 1) అను మారుపేర్లున్నాయి. అపొస్తలుల జాబితాలో అతని పేరు ప్రథ మంగా పేర్కొబడింది (మత్తయి 10:2). అతడు మిగిలిన వారంద రితో సహా పరిమితి గల ఆజ్ఞపై ప్రభువు వలన పంపబడ్డాడు. మత్తయి 16:16-19 లో నేనెవరినని మీరు తలంచుచున్నారు అని క్రీస్తు అడిగి నప్పుడు – "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని అపొస్తలులందరి తరపున పేతురు పల్కాడు. పేతురే ఎందుకు మాట్లా డాడు ! కడమ అపొస్తలులలో ఒక్కడైనను ఎందుకు మాట్లాడలేదు? దానికి జవాబేమిటంటే – పేతురు నాయకులకు నాయకుడై యుండెను. క్రీస్తు దేవుని కుమారుడని అందరు సమ్మతించినా, తనకు తానును తక్కిన అపొస్తలుల తరపునను ఈసత్యాన్ని చెప్పాడు. మిగిలినవారిలో

ఎవరైనా సమ్మతించలేదా, అట్లయితే వారు తప్పక చెప్పియుండు
రాజకీయాలలోగాని వ్యాపారములో గాని మరి జీవిత రంగములో
ఏ నాయకత్వమును గూర్చి యైనను ఆలోచించుము. ఎవడో ఒకడు
నాయకులలో నాయకుడౌతాడు. ఉదాహరణకు: భారతదేశములో
అనేకమంది నాయకులున్నారు. ఆ నాయకులలో ఒకామె ప్రధా
మంత్రి అయ్యింది. లోకములో ఉన్న దేశాలలో యిలాగే జరు
చున్నాదనుట వాస్తవం. అపొస్తలుల విషయంలోను కూడ యి
ప్రత్యక్ష సత్యం.

పేతురు ఒప్పుదల విషయమై క్రీస్తు సంతోషించినట్లు తరు
మనము చదువుతాం. "సీమోను బర్యోనా, నీవు ధన్యుడవు; పరలో
మందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరు
నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీ
నా సంఘమును కట్టుదును; పాతాళలోక ద్వారాలు దాని యెదు
నిలువనేరవు" అని ఆయన జవాబిచ్చాడు. క్రీస్తు యిక్కడ ఏమి
చెప్పుచున్నాడు? పేతురుపై సంఘాన్ని స్థాపించి, సంఘానికి శిర
స్సుగా అతన్ని చేస్తానని ఆయన పేతురుతో చెప్పాడా? చెప్పలేదు
సరిగదా, పేతురు మిగిలిన అపొస్తలులు ఈ సందేశాన్ని ఐహి
ఆధారముల వలన లేక లౌకిక జ్ఞానము వలన పొందలేదు గాని
దేవుని వలన పొందారని ఆయన చెప్పాడు. దాని అర్థ మేమంటే
వారు క్రీస్తుతో కూడ ఉండినవారు; ఆయనబోధలు విన్నారు
ఆయన చేసిన అద్భుత కార్యాలు చూసారు. తత్ఫలితంగా వారు
దేవుని కుమారుడైన క్రీస్తు విశ్వాసు లయ్యారు. అప్పుడు క్రీస్తు
తన సంఘాన్ని ఈ బండపై లేక పునాదిపై అంటే నిజదేవుని
కుమారుడు అనే వాస్తవముపై నిర్మిస్తానని చెప్పాడు. క్రీస్తే ఆ నిజ
మైన పునాది అని పౌలు తరువాత వ్రాస్తాడు (1 కొరింథీ 3:11). క్రీస్తు
బండ మాత్రమే కాదు గాని ముఖ్యమైన మూలరాయి లేక పునాది

అతి ప్రాముఖ్యభాగమని పేతురు చెప్పాడు (1 పేతురు 2.6-8). క్రీస్తు దేవుని కుమారుడు అనే వాస్తవముపై సంఘము నిలచి యుంటాదని దాని తాత్పర్యము. క్రీస్తు కేవలం అబద్ధికుడు, వంచకుడు, మాయగాడు అని తొలిదినాలలోనే నిర్ధారణ చేయబడగల్గి యుండినట్లయితే సంఘము ఏనాడో సమసిపోయి ఉండేది. క్రీస్తు నిజముగా దేవుని కుమారుడు కాడని నేడు నిరూపింపబడగల్గినట్లయితే సంఘము ముకుళించుకుపోతాది. పేతురుపై గాని మరి ఏ నరునిపైనను, ఘనునిపైనను, అల్పునిపైనను సంఘము నిర్మింపబడినట్లయితే, ఎవడు ఆ సంఘ సభ్యుడవ్వగోర్తాడు ?

క్రీస్తు రూపాంతరమును గూర్చి మత్తయి 17లో చదువుతాం. క్రీస్తుతో కూడ పర్వతముపై పేతురు, యాకోబు, యోహాను లుండిరి. ధర్మశాస్త్రానికి సూచనగా మోషే, ప్రవక్తలకు సూచనగా ఏలియా ప్రత్యక్షమయ్యారు. మరల దీనినంతటిని బట్టి పేతురు ప్రభావితుడై మాట్లాడాడు. మోషేను, ఏలియాను, క్రీస్తును సత్కరించుటకై మూడు గుడారములు నిర్మించాలని సలహా యిచ్చాడు. అప్పుడు ఆకాశము నుండి ఒక స్వరము యిట్లు పల్కెను: "ఈయన నా ప్రియ కుమారుడు; ఈయన యందు నే నానందించుచున్నాను; ఈయన మాట వినండి" (మత్తయి 17:5). మరొక మాటలో, పేతురు వాళ్ళ ముగ్గుర్నీ సమానముగా గౌరవించాలనుకొన్నాడు గాని క్రీస్తు అందరి కన్నా ఘనుడు, నరుడు ఆయన మాట వినాలని దేవుడు తెలియజేసాడు.

అపొస్తలుల కార్యములు 2లో, అపొస్తలులు పెంతెకొస్తు అను పండుగ దినాన యెరూషలేములో ఉండిరి. వారందరు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందారు; అన్యభాషలు మాట్లాడారు; సువార్త ప్రకటించారు. గాని నాయకులకు నాయకుడైన పేతురు మరల అక్కడ ముఖ్యవక్తగా కన్పించుచున్నాడు. ప్రకటించుటకు అతడు పదునొకండు గురితో లేచి నిలువబడ్డాడు. ప్రజలు ఆ ప్రసంగమును విన్న తరువాత రక్షణ పొందడానికి ఏమి చేయాలని పేతురును మిగిలిన అపొస్తలులను

అడుగగా — "మీరు మారుమనస్సు పొంది పాపవిముక్తికై ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందండి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు... అని పేతురు వారితో చెప్పాడు" (అపొ. 2:38). యూదులకు సువార్త ప్రకటించే అవకాశాన్నే గాక తొలుతగా అన్యులకు సువార్త ప్రకటించుటకు ఎన్నుకొనబడినవారిలో అతడు ఒకడని అపొ.కా. 10లో మనం చదువుతాం. ఇంత గొప్ప ఔన్నత్యాన్ని నిర్లక్ష్యము చేసి సున్నతి, మరికొన్ని ఆచరణలకు అన్యులను బద్ధులుగా చేయాలని అంతియొకయలో కొందరు యూదులు యత్నిస్తున్నప్పుడు, పేతురు శోధింపబడి వారితో కలసిపోయాడు. తత్ఫలితముగా పౌలు అతన్ని ముఖాముఖిగా గద్దించాడు (గలతీ 2). ఇదంతా అతనియొక్క శక్తిని, బలహీనతను సూచిస్తున్నది. పేతురు జీవితమంతా యిలాగే గడిచింది.

తుదకు అంతయు జరిగిన తరువాత, పేతురుయొక్క బలహీనత కంటే బలమే అధికమయ్యింది. కొన్ని సందర్భాల్లో క్రీస్తు నామమున యికమీదట బోధింపకూడదని అతడు, యితరులు హెచ్చరింపబడ్డారు. వారు బోధింపక మాననందువలన చెరసాలలో వేయబడి కొట్టబడినను, వారి కొరకు మిక్కిలి శ్రమనొందిన వాని నిమిత్తము స్వల్పముగా శ్రమపడగల్గి దానిని వారు ఆనందమునకు ఆస్పదముగా ఎంచారు. నాయకులకు నాయకుడైన అతడు సంఘానికి త్రాణ అయ్యాడు. క్రీస్తు విషయమై పేతురు హతసాక్షి ఆయెనని లౌకిక చరిత్ర చెప్పుచున్నది. క్రీస్తువలె సిలువ వేయబడుటకు పాత్రుడను కాను అని యెంచినందు వలన తలక్రిందులుగా సిలువ వేయబడాలని వేడుకొన్నాడు.

మన మందరము పేతురువలె మహానాయకులం కాలేమను విషయం తథ్యమే. గాని నేటి సంఘములో నాయకుల ఆవశ్యకత ఉంది. సాధ్యమైనంత ఉత్తమ నాయకులను పెంపొందింపగలము. 1 తిమోతి 3, తీతు 1 యందుగల అర్హతలను కల్గిన ఇద్దరు లేక అంత

కంటె ఎక్కువ మంది పెద్దలను పరిచారకులను ప్రతి స్థానిక సంఘము కల్గియుండాలని ప్రభువు సంకల్పించాడు. సంఘానికి స్థానికముగాను, విశ్వజనీనముగాను ప్రభువు తానొక్కడే, ఒకే ఒక్క శిరస్సైయున్నాడు (కొలస్స 1:18; ఎఫెసీ 1:22, 23). స్థానిక సంఘములో సహితము ఎవడైనా పురుషుడు నియంతయై మందను పాలించటానికి లేక వాని యిష్టాన్ని సంఘముపై రుద్దటానికి ఆయన ఒప్పుకోడు. ఇంతకు ముందే చెప్పినట్లు, అర్హతలన్నీ యున్న పురుషులు ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువ మంది పెద్దలుగా లేక కాపరులుగా లేక అధ్యక్షులుగా లేక కాచువారిగా స్థానిక సంఘములో నియమింపబడాలి. గనుక వారు ఆ స్థానిక సంఘములో ఆధ్యాత్మిక నాయకత్వము వహించాలి. వారు ఆ సంఘాన్ని వెనుకనుండి తోలేవారుగా కాదు గాని ముందుండి నడిపించేవారుగా యుండాలి. వారు దేవుని సత్యాన్ని బోధించాలి. జీవిత విధానమును సేవచేయు రీతిని వారు ఆదర్శముద్వారా కనబరచుట యింకా శ్రేయస్కరం. పలుమార్లు నాయకులైనవారు ఎంత మాత్రము నాయకుల్లా ప్రవర్తించరు. వారు సంఘాన్ని హీనస్థితికి దిగజారుస్తారు. ప్రయాణం చేస్తున్న యిరువురు వ్యక్తులు, వేరొకణ్ణి కలుసుకొన్న కథలా ఉంటాది: ఒక గంట క్రితము గాని అంతకు ముందుగాని ఈ దారిని ఎవరైనా మనుష్యులు గుంపుగా వెళ్ళటం నీవు చూసావా? అని వారు అడిగారు. నేను చూసానని అతడు జవాబిచ్చాడు. గాని అలా వాళ్ళెందుకు అడిగారో అతడు తెలిసికోగోరాడు. అప్పుడు వాళ్ళేమి చెప్పారంటే — మేము ఆ సమూహపు నాయకులం గనుక వాళ్ళ కొరకు వెదుకుచున్నాము. అట్లనే కొన్నిసార్లు నాయకులు లేదా పెద్దలు సంఘానికి ముందుండరు. కొన్నిమార్లు సహోదరులే క్రీస్తుకొరకు ఎక్కువ ప్రయాసపడ అభిలషిస్తారు, ఎక్కువ కృషిని చేపట్ట గోర్తారు, ఎక్కువమంది సువార్తికులకు సహాయము చేయుటకు ఇష్టపడతారు, అలాగే యింకా ఎన్నో. కాని

నాయకులు కూర్చోవాలనుకొంటారు, తమ సొమ్ము బేంకులలో దాచు కొంటారు. ఇలాంటి ధోరణి సంఘ పురోభివృద్ధికి దోహదము చేయదు గాని దానిని చంపేస్తాది. పెద్దలు కర్తవ్యాన్ని ఆలోచించాలి; లక్ష్యాలు నిర్ణయించాలి; ప్రభువుకొరకు గొప్ప కార్యాలు చేసేవారిగా సహోదరులను పురికొల్పాలి. అర్హతలు గల పరిచారకులు నియమింప బడాలి. వారు పరిచర్యలో పెద్దలకు సహాయము చేయాలి. పెద్దలుగను పరిచారకులుగను నియమింపబడుటకు సంఘములోని పురుషులకు తగిన అర్హతలు లేనట్లయితే వారు నియమింపబడకూడదు. అట్లయితే స్థానిక సంఘానికి ఎవరు నాయకత్వము వహించాలి? అటువంటప్పుడు కార్య నిర్వాహకత్వమును సంఘమందలి పురుషులు చేపట్టాలి. వారు సమా వేశమై అవసరములు, సమస్యలు, లక్ష్యాలను గూర్చి, వాక్యమును ఉపదేశించుటలోను, ప్రకటించుటలోను, ప్రభువు పని కొనసాగించుట లోను యింకా శక్తివంతముగా యుండుట ఎట్లో సంభాషించుకోవాలి. ప్రతి ఒకడు ఇతరులను గౌరవించుట నేర్చుకొనాలి. అందరు కలసి కృషి చేయుట నేర్చుకొనాలి. పవిత్రత సమైక్యత సదా అవలంబించబడ వలెను. అట్టి సమయములో పురుషులకు మరి ప్రత్యేకముగా యౌవన స్థులైన పురుషులకు పెద్దలుగా అవ్వాలనే వాంఛ యుండాలి. వారు ఆ పదవియందు నియమింపపడుటకు తగిన యోగ్యతలు గలవారైనప్పుడు వారు కష్టపడి పనిచేయాలి. పెత్తనం చెలాయించే ఉద్దేశముతో వారు పెద్దలుగాగాని పరిచారకులుగా గాని కాకూడదు. కాని ప్రభువు యొక్క ప్రజలను నడిపించి, వారికి సేవచేసే చిత్తశుద్ధి కావాలి. అంత వరకు పురుషులే కార్యనిర్వహణను, నాయకత్వాన్ని కొనసాగించాలి.

సంఘములో సువార్తికులను ఉపదేశకులను కూడ ప్రభువు నియ మించాడు. పెద్దలున్నట్లయితే వారి పర్యవేక్షణలో పనిచేయాలి. అన్ని రకాల సువార్తికులు,ఉపదేశకులు ఉన్నారని గ్రహించుకోవాలి. కొందరు గంభీరముగా మాట్లాడితే, మరికొందరు మృదువుగా మాట్లాడతారు.

కొందరు యితరుల కంటె విద్యాధికులులై యున్నారు. గాని యిక్కడ ప్రాముఖ్యమైన సంగతి ఏమిటంటే, ప్రభువు నొద్దకు మార్చబడి, ఆయన వాక్యాన్ని ఎరిగి, ప్రకటించే దాని ప్రకారం ప్రవర్తిస్తూ, చెప్పిన వాటి విషయం నమ్మకముగా ఉండటమే. అదే విధముగా, స్త్రీలలో కూడ నాయకత్వానికి తావుంది. వృద్ధ స్త్రీలు యౌవన స్త్రీలకు పిల్లలకు బోధించాలి. వారు తమ భక్తిగల జీవితము, సత్క్రియల ద్వారా కూడ బోధింపవచ్చు.

నాయకుల కన్నా సంఘము పటిష్టవంతము కాలేదు. అసమర్థ నాయకత్వము వలన స్థానిక సంఘము నిర్వీర్యమై, తుదకు మృతి నొందవచ్చు కూడ. సమర్థవంతమైన నాయకత్వము వలన సంఘము సంఖ్యలోను ఆధ్యాత్మికతలోను పురోగమిస్తాది. సువార్తికులైన మనకు ఉపాధి కల్పించటానికే సంఘం ఉన్నాది అనుకోకూడదు. స్వార్థ ప్రయోజనాలకు సంఘాన్ని వినియోగించుకో కూడదు గాని ప్రభువు ప్రయోజనాలను సాధించటానికి మనము సంఘము వలన ఉపయోగింపబడాలి. మనము నాయకులమా కాదా అన్నదే దీనంతటి ఆంతర్యం. ఔను సంఘానికి ఉత్తమ నాయకుల ఆవశ్యకత ఉంది. నీవు ఎలాంటి నాయకుడవు? నీవు ఎలాంటివాడవో కాలమే చెప్తాది. కాని నీవున్న స్థితిలోనే నీవు తృప్తి పడవద్దు. దేవుని వాక్యము చదువుటద్వారాను, దానిని ధ్యానించుటద్వారాను ప్రభువునకు ఉపయోగపడువానిగ తయారు కమ్ము.

# మాదిరి జీవితము

(గత సంచిక తరువాయి)

—P. ప్రకాశము, హైదరాబాదు

## ప్రేమలో మాదిరి

(I తిమో 4:12)

మనము గవర్నమెంటు ఆఫీసులలో పని చేయు బిళ్ల బంట్రోతులను చూచినపుడు వారు ఒక బిళ్ళను ధరించియుందురు. ఆ బిళ్ళపై వ్రాతను చదివినపుడు అతడు ఏ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాడో సులభముగా గ్రహించగలము. ఆ బిళ్ళపై Board of Revenue అనియో Board of Education అనియో వ్రాయబడి యుండును అనగా ఆ బిళ్ళ చూచి దానిమీద వ్రాత చదువగానే ఆ డిపార్టుమెంటు మనిషని మనము అర్థము చేసికొనగలము.

క్రీస్తుప్రభువు తన శిష్యులని లోకము గ్రహించుటకు ఒక సూచన తెలిపెను. యోహాను 13 : 34-35 మీరు ఒకరినొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ ఇచ్చుచున్నాను-నేను మిమ్మును ప్రేమించినట్టే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను.

మీరు ఒకనియెడల ఒకడు ప్రేమ గలవారైనయెడల దీనినిబట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసికొందురనెను.

కనుక యేసుక్రీస్తు శిష్యులని లోకము తెలిసికొనే గుర్తు ఒకరినొకరు ప్రేమించుట. ఇట్లా ప్రేమించుకొనువారే ప్రభువు శిష్యులు. ఆత్మ ఫలములలో మొదటిది ప్రేమ (గలతీ 5 : 22). పౌలు 1 కొరింథీ 13 అధ్యాయములో ప్రేమనుగూర్చి పూర్తిగా వివరించెను. ప్రేమ లేనివాడు వ్యర్థుడు. ప్రేమ లేనివాడు దేవుని నెరుగనివాడు. క్రైస్తవులను గూర్చి ఒకరు చెప్పినది ఏమనగా కలసి మెలసి విరోధముగ ఉన్నవారు అనెను. దాని అర్థమేమనగా క్రైస్తవులు కలసిమెలసి ఉండి లోపల విరోధ భావముతో ఉంటారని అతని కర్థమైనది.

1 యోహాను 3:18. చిన్నపిల్లలారా మాటతోను, నాలుకతోను కాక క్రియతోను, సత్యముతోను ప్రేమింతము. ఒక బిషప్పుగారు రైలులో ప్రయాణము చేస్తూ ఒక వ్యక్తితో దేవుని ప్రేమనుగూర్చి బోధించుచుండెను. కొంత సేపటికి భోజనముచేసే సమయమాయెను. బిషప్‌గారు వెనుకకు తిరిగి ఆయన తీసికొని వచ్చిన మంచి ఆహార పదార్థములు బాగుగా భుజించి మరలా వెనుకకు తిరిగి దేవుని ప్రేమను గూర్చి బోధించ ప్రారంభించెను. అయితే అతని బోధ ఇంతకు ముందు నుంచి వినుచున్న వ్యక్తి ఆకలితో బాధపడుచు బిషప్‌గారు ఏదైన పండో ఏదో ఇస్తారుగదా అని నిరీక్షించెను. గాని ఆయన అటువంటి మనస్సుగల వ్యక్తి కాడు. ఇక ఆ బోధ వినేవానికి ఆయనమీద విరక్తి కలిగి ప్రేమనుగూర్చి చెప్పుచున్నాడుగాని బిషప్‌గారికి ప్రేమించుట తెలియదని చెప్పెను. మాటలతో ప్రేమించుట కాదు క్రియతో ప్రేమించు జీవితము మనకు ఉండాలి- యాకోబు 2:14-16.

యేసుప్రభువు తన శిష్యుల పాదములు కడిగెను. ఆయనను అప్పగించుటకు సిద్ధముగా ఉన్న యూదా ఇస్కరియోతు పాదములు కడిగెను. మనము కూడ శత్రువులను ప్రేమింప బద్ధులమై యున్నాము. ప్రేమ చూపుటయే క్రైస్తవ సుగుణము.

## విశ్వాసములో మాదిరి

విశ్వాసము ఆత్మఫలములో ఒకటియై యున్నది. క్రైస్తవ గుణ లక్షణములలో విశ్వాసము ఒక గొప్ప సుగుణమై యున్నది.

తనయందు విశ్వాసముంచిన ఒక శతాధిపతిని గూర్చి యేసు ప్రభువు ఈలాగు చెప్పెను.

మత్త 8:10 ఇశ్రాయేలీయులలో నెవరికైనను నేనింత విశ్వాస మున్నట్టు చూడలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను.

మత్తయి 15:28 లో ప్రభువు కనాను స్త్రీ విశ్వాసమును గూర్చి ఈలాగు చెప్పెను:

అమ్మా – నీ విశ్వాసము గొప్పది నీవు కోరినట్టే నీకు అవును గాక అని ఆమెతో చెప్పెను ఆగడియలోనే ఆమె కుమార్తె స్వస్థత నొందెను. ప్రభువునందు మనకట్టి విశ్వాస మున్నదని ప్రజలు చూడ గలరా?

హెబ్రీ 11 వ అధ్యాయములో విశ్వాస వీరుల పట ప్రదర్శన చేయగలము. పౌలు విశ్వాసమును కాపాడుకొనెను.

అనేక శ్రమలుపడి శిష్యులు అపొస్తలులు విశ్వాస వీరులుగా మరణించిరి. మన క్రైస్తవ ప్రవర్తనలో విశ్వాస పాత్రులముగా ఉన్నామా? చెప్పిన మాట ప్రకారము చేయగలుగు చున్నామా! మన కివ్వబడిన పనిలో విశ్వాస పాత్రులముగా ఉన్నామా? మన కివ్వబడిన సొమ్ములో నమ్మకముగా ఉన్నామా? మిక్కిలి కొంచె ములో నమ్మకముగా ఉన్నవాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును. మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువలోను అన్యాయముగా ఉండును (లూకా 16:10).

లూకా 16:11 కాబట్టి మీరు అన్యాయపుసిరి విషయములో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనము ఎవడు నీవశము చేయును? మీరు పరుల సొమ్ము విషయములో నమ్మకముగా ఉండని యెడల మీ సొంతమైనది మీకు ఎవడిచ్చును - దేవుని సొమ్ము విష యములోను దేవుని కార్యముల విషయములోను విశ్వాస పాత్రులమై యుండవలెను.

యాకోబు 2 : 26 ప్రాణములేని శరీర మేలాగు మృతమో ఆలాగే క్రియలులేని విశ్వాసమును మృతము - మన క్రియలద్వారా మన విశ్వాసమును ప్రజలు చూడవలెను. విశ్వాస విషయములో మనము మాదిరిగా జీవించవలెను.

## పవిత్రతలో మాదిరి

పవిత్రమైన జీవితము : మిమ్మును పిలిచినవాడు పరిశుద్ధుడై

యున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి (1 పేతు 1:16). హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు (మత్త 5:8). పరిశుద్ధత లేకుండ ఎవడును ప్రభువును చూడడు (హెబ్రీ 12:14). నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండుడి అని ప్రభువు చెప్పుచున్నాడు.

సమస్త ప్రవర్తనలో పరిశుద్ధత, తలంపులలో పరిశుద్ధత, కార్యములలో పరిశుద్ధత, పరిశుద్ధ జీవితము కలిగి యుండవలెను.

యేసు చెప్పినది : యోహాను 8 : 46 లో నా యందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును అని సవాలు చేసినాడు.

ఆయన పరిశుద్ధుడై యుండునట్లు మనమును పరిశుద్ధులునుగా చేసెను. క్రైస్తవుడు అనగా పరిశుద్ధుడు, పరిశుద్ధులై యున్నవారు. తిమోతికి పౌలు ఈమాట చెప్పెను (1 తిమో 5:22). నీవు పవిత్రుడవుగా ఉండునట్లు చూచుకొనుము.

**Keep thyself pure**
**Pure as He is**

దేవునివలె మనము పరిశుద్ధులుగా ఉండవలెనని కోరుచున్నాడు. పాపములో జీవించువాడు పరిశుద్ధుని వాక్యము ప్రకటించుట సాతానుకు చాల సంతోషకరమైన విషయము. మన జీవితమును గూర్చి ఒక దినము లెక్క అప్పగించవలసి యున్నది.

క్రీస్తుయొక్క సిలువ మన వెనుక నున్నది. క్రీస్తు యొక్క న్యాయ సింహాసనము మనముందు ఉన్నది.

**The cross of Christ is behind you**
**The judgment seat is before you.**

పరిశుద్ధ జీవితము గలిగి విశ్వాసులకు మాదిరిగా జీవించవలెను.

మాటలోను, ప్రవర్తనలోను, ప్రేమలోను, విశ్వాసములోను, పరిశుద్ధతలోను విశ్వాసులకు మాదిరిగా ఉండుము.

( సమాప్తం )

# క్రొత్త జన్మ

(గత సంచిక తరువాయి) —పెర్రీకోట్స్

## క్రొత్త జన్మ ఋజువు

మార్పుజెందిన వారి సందర్భములను చదువుటద్వారా క్రొ జన్మ అనగా యేమిటో ఒకడు తెలిసికొనగలడు. యివి అపొ లుల కార్యములు అను పుస్తకములో రికార్డు చేయబడి ఎందువలననగా సంఘము స్థాపించబడిన తరువాత క్రొత్త జన్ యొక్క విధానము సవిస్తరముగా అందు రుజువుపరచబడెను. "నీ తిరిగి జన్మించవలెను" అని అపొస్తలులు చెప్పినట్లు ఎక్కడ లేకపో నను, ఆ మాటలకు సమానముగా వారు బోధించిరి. దేవుని రాజ్యము లోనికి కొన్ని ఆత్మలు క్రొత్తగా ఎట్లు జన్మించెనో వాటి ఉదాహరణ లను ఇప్పుడు గమనించుము :

1. పెంతెకొస్తు దినమున క్రీస్తు రాజ్యము స్థాపించబడెను యేసు వాగ్దానము చేసినట్లే అపొస్తలులను సర్వసత్యములోనికి నడి పించుటకు పరిశుద్ధాత్ముడు వచ్చెను (యోహాను 14 : 16, 17, 26; 15 : 26, 27; అపొ. కా. 1 : 4-8; 2 : 1-4). ఆ దినమందు మొట్ట మొదటిసారిగా క్రీస్తుయొక్క సంపూర్ణ సువార్త (ఆయన మరణ సమాధి, పునరుత్థానముల వాస్తవములతో సహా) ప్రకటించబడెను పేతురు ప్రసంగమును ప్రజలు వినిన తరువాత యేసే క్రీస్తని అనేకు నమ్మి, "సహోదరులారా మేమేమి చేతుము?" అని యడిగిరి. అం కతడు "మీరు మారు మనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్ర వాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని చెప్పె (అపొ. కా. 2:38). అట్లయినప్పుడు వారి క్రొత్త జన్మయైన రక్ష మార్గమును గూర్చి విపులీకరించబడెను. మూడు వేలమంది విధేయు ఆ నాడు దేవుని రాజ్యములో ప్రవేశించిరి. కొన్ని సంవత్సరము

గడచిన తరువాత పేతురు పొంతు, గలతీయ, కప్పదొకియ, ఆసియ, బితునియ ప్రాంతములలో చెదరియున్న క్రైస్తవులకు వ్రాయుచు వారు తిరిగి జన్మించిన వారని చెప్పెను (1 పేతురు 1:1, 23). వీరిలో కొందరు పెంతెకొస్తు దినమున రక్షింపబడినవారు (అపొ.కా. 2:9, 10). పేతురు మొదటి సువార్త ప్రసంగమును చేయగా అతడు రాజ్యపు వి త్తనమును వి త్తెను; ప్రజలు దానిని వినిరి, విశ్వసించిరి, తమ హృదయములోనికి దానినంగీకరించిరి, జనింపచేయబడిరి. రక్షణ పొందుటకు మేమేమి చేయవలెనని వారడిగినప్పుడు వారు మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందవలెనని హెచ్చరింపబడిరి. వారు దానికి విధేయులైరి. మరియు విని, విశ్వసించి బాప్తిస్మము పొందిన వారందరు సంఘములో చేర్చబడిరి. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" (అపొ.కా. 2:47). దానివలన వారు రాజ్యములో పౌరులైరి, ఏలయనగా ప్రభువు సంఘమే రాజ్యము. గనుక ఒకడు దేనివలన రాజ్యములో ప్రవేశించునో, దానివలనే క్రొత్తనిబంధన సంఘముతో చేర్చబడును. ఒకడు దేవుని కుటుంబమైన సంఘములో లేకుండా నూతన సృష్టి కాజాలడు (1 తిమోతి 3:15). అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయములో రికార్డు చేయబడిన మూడు వేలమంది మార్పు జెందిన సంఘటన క్రొత్త జన్మయొక్క మంచి మాదిరియై యున్నది.

2. ఫిలిప్పు ప్రకటించగా సమరయులు మార్పు జెందుట క్రొత్త జన్మయొక్క మరియొక ఉదాహరణయై యున్నది. ఆత్మావేశము గలిగిన సువార్తికుడు సమరయకు వెళ్ళి క్రీస్తును గూర్చి బోధించెను. అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి (అపొ.కా. 8:5_12). వారు తిరిగి జన్మించిరి, నీటిమూలముగాను, ఆత్మమూలముగాను జన్మించిరి.

3. ఐతియొపీయ నపుంసకుడు సువార్తను వినెను. దానిని

విశ్వసించెను, క్రీస్తునందు తనకున్న విశ్వాసము నొప్పుకొనెను. పశ్చాత్తాప్తుడై నీటిలో ముంచబడెను (అపొ. కా. 8:26-39) ఆ నపుంసకుడు ఒక నూతన జీవితములోనికి నీటినుండి వెలివచ్చెను. అతడు క్రీస్తులో ఒక నూతన సృష్టి; తన త్రోవలో సంతోషించుచు వెళ్ళెను. అతడు కూడా క్రొత్త జన్మను పొందెను.

4. కొరింధీయులు క్రొత్త జన్మను పొందిన విధానమంతయు ఈ మాటలలో వ్యక్తపరచబడెను : "మరియు కొరింధీయులలో అనేకులు విని విశ్వసించి బాప్తిస్మము పొందిరి" (అపొ.కా. 18:8).

గనుక సూక్ష్మముగా ప్రజలు తిరిగి జన్మించిన ఉదాహరణలను బట్టి యోహాను 3:1-8 ని చదువవలెను. క్రీస్తు నీకొదేముతో నీటి మూలముగాను ఆత్మ మూలముగాను జన్మించుటను గూర్చి చెప్పినప్పు డాయన మనస్సులో యేమి ఉండెనో అదే యీ ఉదాహరణలలో జరిగెను. పాపులు రక్షించబడవలెనంటే యేమి చేయవలెనో అపొస్తలులు చెప్పినపుడు వారు క్రొత్త జన్మను చాల సూక్ష్మముగా తెలియజేసిరి. అందువలన ఉదాహరణద్వారా క్రొత్త జన్మను బాగుగా అర్థము చేసికొనవచ్చును. మరియు లేఖన భావార్థమును లేఖనము ద్వారానే చెప్పుటకన్న మంచి మార్గమొకటి లేదు. గనుక సువార్తను వినుట, సువార్తను విశ్వసించుట, నిజముగా పాపమును గూర్చి మారు మనస్సు పొందుట, క్రీస్తును దేవుని కుమారుడని ఒప్పుకొనుట, ప్రభువు నామమున బాప్తిస్మము పొందుట క్రొత్త జన్మ యగును. ఒకడు ఈ పనులను చేసినయెడల అతడు దేవుని రాజ్యములో ప్రవేశించును

## సమాంతర వచనములు

అంతే కాకుండా, ఈ ఆత్మీయమార్పు అగు క్రొత్త జన్మను గూర్చిన మరికొన్ని యితర వచనములను గమనించుము.

1. రాజ్యములో ప్రవేశించుటను గూర్చి క్రీస్తు చెప్పిన

సంగతులను గమనించుము: (ఎ) నీటిమూలముగా జన్మించుడి = దేవుని రాజ్యములో ప్రవేశించుడి (బి) మార్పు నొందుడి = రాజ్యములో ప్రవేశించుడి (మత్తయి 18:3). (సి) దేవుని చిత్తమును జరిగించుడి = రాజ్యములో ప్రవేశించుడి (మత్తయి 7 : 21). నీటిమూలముగాను, ఆత్మ మూలముగా జన్మించుడి యను మాటలను ఒకడు అర్థము చేసికొనలేని యెడల బహుశా అతడు మార్పు చెందుడి యను మాటలను అర్థము చేసుకొనగలడు. అయితే మార్పుజెందుట, ప్రభువు తట్టు తిరుగుట గ్రహింపు కాని యెడల తండ్రి చిత్తమును జరిగించుట యను పదములు తప్పక గ్రహింపగును. ఈ పదములన్నియు ఒక్కటే, మరియు వాటి ప్రతిఫలముకూడ ఒక్కటే, అది రాజ్యములో ప్రవేశము. దేవుని చిత్తమునకు లోబడని ఒక వ్యక్తి దేవుని రాజ్యము పౌరుడు కాజాలడు. ఈ మూడు కూడ ఒకే విషయములో సమానమైనవి. గనుక అవి పరస్పరముగా సమానమైనవి.

2. క్రొత్తజన్మ అనునది క్రీస్తు చెప్పిన ఈ మాటలలో వివరించబడినదని గమనించుము: "మరియు - మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 15, 16). ప్రభువు ఈ లోకములో జీవించియుండగా పరలోక రాజ్య సూత్రములను గూర్చి ఉదాహరణద్వారాను, ఉపమానముల ద్వారాను బోధించెను. గాని ఆయన లేచిన తరువాత ఖచ్చితమైన ఆజ్ఞల నిచ్చెను. యేసు పరలోకమున కెక్కిపోవకముందు ఇక్కడ రక్షణ నిమిత్తమై నీకొదేముతో యేమి అవుసరమని చెప్పెనో అదే సంగతులను ఇక్కడ చెప్పెను గాని ఆయన అలంకార రూపకముగా దానిని చెప్పలేదు. యేసు చెప్పిన ఈ రెండు సంగతులు అనగా యోహాను 3:5, మార్కు 16:16ల యొక్క భావము సమానమే.

3. క్రొత్త జన్మ అను అంశముపై క్రీస్తు చెప్పిన దానిని అపొ

స్తులుడైన పౌలు చెప్పిన దానితో పోల్చుము: "యేసు ఇట్లనెను. ఒకడు నీటి మూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించితేనే గాని దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" (యోహాను 3 : 5). సంఘమును క్రీస్తు వాక్యముతో ఉదక స్నానముచేత పవిత్రపరచి పరిశుద్ధపరచెనని (ఎఫెసీ 5:27), మరియు "మనము నీతిని అనుసరించి చేసిన క్రియల మూలముగా కాక, తన కనికరము చొప్పుననే పునర్జన్మ సంబంధమైన స్నానము ద్వారాను, పరిశుద్ధాత్మ మనకు నూతన స్వభావము కలుగజేయుట ద్వారాను మనలను రక్షించెను" అని పౌలు చెప్పెను (తీతు 3 : 5).

ఈ వచనములలోని ముఖ్య సంగతులను సమానాంతరముగ ఇట్లు గమనించగలము.

| యోహాను 3:5 | ఎఫెసీ 5:27 | తీతు 3:5 |
|---|---|---|
| 1. నీటిమూలముగా జన్మించుట | ఉదకస్నానము చేయుట | పునర్జన్మ సంబంధమైన స్నానము |
| 2. ఆత్మమూలముగా జన్మించుట | వాక్యముతో | పరిశుద్ధాత్మ నూతన స్వభావము కలుగజేయుట |
| 3. దేవుని రాజ్యములో ప్రవేశము | పవిత్ర పరచబడుట | రక్షించుట |

వాక్యముతో ఉదకస్నానముచేత ప్రజలు పవిత్ర పరచబడుదురు; ఆ ఉదకస్నానము బాప్తిస్మము (హెబ్రీ 10 : 22; అపొ. కా 22:16). పునర్జన్మ సంబంధమైన స్నానము పునర్జన్మలో ఒక భాగమై యున్నది. అదికూడ బాప్తిస్మమే. ప్రజలు విశ్వాసమువలన దేవుని వాక్యమునకు విధేయత చూపుచు బాప్తిస్మము పొందుటవలన రక్షింపబడుదురని నిజానికి ఈ వచనములు బోధించుచున్నవి. (యోహాను 3:5 మరియు మార్కు 16:16 సమానాంతరములు).

క్రొత్త జన్మయే పునర్జన్మ; తిరిగి ఆరంభించుట యని లేక ఆత్మీయముగా తిరిగి జన్మించుట యని దీని భావము. దేవుని రాజ్యములో ప్రవేశించు విధానమంతయు అనగా విశ్వాసము బాప్తిస్మమును దానిలో యున్నవి. పరిశుద్ధాత్మవలన నూతన పరచబడుట యనగా సత్యవాక్యముద్వారా హృదయములో ఆత్మ కలిగించు విశ్వాసము, క్రొత్త జన్మ అంతా అదేకాదుగాని దానిలో అత్యవుసర భాగమై యున్నది. బాప్తిస్మముకూడ దానిలో ఒక భాగమై యున్నది. అయితే పునర్జన్మ అంతా బాప్తిస్మమే కాదు. బాప్తిస్మమే క్రొత్తజన్మ కాదు, గాని అది క్రొత్త జన్మలో ఒక భాగమై యున్నది. వాక్యముద్వారా ఆత్మ అంతరంగిక మార్పును కలిగించిన తరువాత ఒకడు ముంచడము పొందుటద్వారా రాజ్యములో ప్రవేశింపజేయబడును.

ఒక అవిశ్వాసికిగాని లేక విశ్వాసముంచ లేనివానికిగాని బాప్తిస్మమిచ్చుట క్రొత్త నిబంధన బాప్తిస్మముకాదు. బాప్తిస్మము కేవలము ఒక భౌతిక క్రియకాదు, బాప్తిస్మము పొందువాడు విశ్వసించవలెనని లేఖనములు కోరుచున్నవి. బాప్తిస్మమునకు ముందు అవుసరమైన సంగతులను ఒక శిశువు చేయలేడు గనుక ఆ శిశువునకు బాప్తిస్మమియ్య కూడదు. క్రీస్తు రాజ్యపు చట్టము శిశు బాప్తిస్మము బహిష్కరించెను. ఒకడు బాప్తిస్మము పొందకముందు అతడు బోధింపబడవలెను (మత్తయి 28:19, 20). సంఘ సభ్యుడగు ప్రతివాడును మొదట దేవునిచేత బోధింపబడవలెను (యోహాను 6:45). సంఘ సభ్యులైనవారు విశ్వాసమువలననైన సభ్యులు (గలతీ 3:26, 27).

ఇంకా ఏమంటే, మన నీతి క్రియల మూలముగాగాక పునర్జన్మ సంబంధమైన స్నానముద్వారా, అనగా బాప్తిస్మముద్వారా దేవుడు రక్షించును అని పౌలు చెప్పుచున్నందున బాప్తిస్మము మానవులు చేయు ఒక నీతి క్రియకాదు. అది దేవుని నీతి క్రియయే (మత్తయి 3:15; రోమా 1:16, 17; 10:1-3; అపొ. కా. 10:34, 35, కీర్తన

119:172; యెషయా 64:6; యోహాను 6:23, 29). బాప్తిస్మములో మర్మయుక్తమైన శక్తి ఏమియు లేదు; విశ్వాసములో కూడ అట్టి మర్మయుక్తమైన శక్తి ఏదీ లేదు. ఒకడు క్రీస్తుకు విధేయత చూపగానే ఆయన అతని రక్షణకు కారకుడగును (హెబ్రీ 5:8, 9). ప్రభువునకు విధేయులైన వారికి మాత్రమే రక్షణ అనుగ్రహించ బడును.

ఒకడు తనకుగా తాను సంఘములో చేరుట తిరిగి జన్మించుటతో సమానము కాదు. అయినను అనేకులు తిరిగి జన్మించకపోయినను సంఖ్య కొరకు వేలకొలదిమంది సంఘసభ్యులని చూపించుట జరుగుచున్నది; అది విచారకరము. నిజానికి అట్టి ప్రజలు క్రీస్తు సంఘములో లేరు. "ఒకడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యములో ప్రవేశింపలేడు" అని క్రీస్తు చెప్పిన సంగతి క్రొత్త జన్మను పాపికి దేవుని రాజ్యమునకును మధ్య ఉంచుచున్నది.

## సంగ్రహము

ఈ పాఠములో ఈ దిగువ సత్యములు గ్రహించితిమి:

1. నీటిమూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించితేనేగాని యెవడును దేవుని రాజ్యములో ప్రవేశించలేడని క్రీస్తు నీకొదేముతో చెప్పెను.

2. దేవుని రాజ్యవిత్తనమైన సువార్తద్వారా ఆత్మీయముగా ఒకడు దేవుని వలన జనింప జేయబడును.

3. ఒకడు సువార్తను విశ్వసించగానే పరిశుద్ధాత్మద్వారా తండ్రి వలన జనింపజేయబడును.

4. ఒకడు జనింపజేయబడిన తరువాత లేక విశ్వాసియైన తరువాత అతడు మారుమనస్సు, ఒప్పుకోలు, బాప్తిస్మము పొందిన యెడల అతడు తిరిగి జన్మించిన వాడగును.

5. మారుమనస్సు పొందిన విశ్వాసి బాప్తిస్మము పొంది

నప్పుడు అతడు నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించినవాడై దేవుని కుటుంబమగు రాజ్యములో ప్రవేశించును.

6. గనుక ఒకడు యేసు దేవుని కుమారుడని తన హృదయములో విశ్వసించిన తరువాత అతడు నీటిలో ముంచడము పొందక పోయిన యెడల అతడు క్రైస్తవుడు కాజాలడు.

(సమాప్తం)

---

# దేవునితో నడచుట
## (Walking with God)

హనోకు — విశ్వాసమును బట్టి హనోకు మరణము చూడకుండునట్లు కొనిపోబడెను (ఆదికాండము 5:24).

నోవహు — (i) తన ఇంటివారి రక్షణ కొరకు ఓడను సిద్ధము చేసికొనెను.

(ii) విశ్వాసము బట్టి కలుగు నీతికి వారసుడయ్యెను (ఆదికా. 6 : 9)

జెకర్యా, ఎలీసబెతు — ప్రభువు యొక్క సకలమైన ఆజ్ఞల చొప్పునను, న్యాయవిధుల చొప్పునను నిరపరాధులుగ నడచుకొనుచు దేవుని దృష్టికి నీతిమంతులై యుండిరి (లూకా 1:6).

దేవునితో నడచుట యనగా :-

1. జెకర్యా, ఎలీసబెతుల వలె నిరపరాధులుగ నడచుకోవాలి.
   దేవుని దృష్టికి నీతిమంతులై యుండాలి. కీర్తనలు 1:1-4.
   అట్టివారిని ఆయన తన సారూప్యము గలవారినిగా చేయును. రోమా 8 : 29.
   అట్టివారికి మెప్పు మనుష్యులవలన కలుగదు. దేవుని వలననే కలుగును. రోమా 2:29.

2. దేవుని యొక్క మార్గములు :-

దేవుడు యథార్థవంతుడు. యెహోవా వాక్కు నిర్మలము. తన
శరణు జొచ్చినవారి కందరికి ఆయన కేడెము. కీర్తనలు 18:30

3. క్రీస్తునందు ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును
పొందవలెనని గురియొద్దకే పరుగెత్తుచున్నానని అపొస్తలుడైన
పౌలు ఫిలిప్పీ 3:14 లో చెప్పుచున్నాడు.

4. మనము దేవునితో నడచుచున్నపుడు ఏదియు మనలను దేవుని
నుండి వేరు చేయలేదు. రోమా 8:35-39.

మనము దేవునితో నడచుచున్నపుడు మన జీవితములు నూతన
పరచబడును. మన పాత క్రియలు, పాత జీవితము, పాత అల
వాట్లు "పాత" అనునవే సమస్తము మనలో నుండిపోవును
కాగా ఎవడైనను క్రీస్తునందున్నయెడల వాడు నూతన సృష్టి.
2 కొరింథి 5:17.

5. దేవునితో నడచువారు అన్ని విషయములలో ప్రభువును
సంతోషపరచునట్లు ఆయనకు తగినట్లుగ నడచుకొనవలెను
కొలస్స 1:10.

6. దేవునితో నడచుట యనగా ప్రేమ గలిగి జీవించుట. ఆయన
ఆజ్ఞలు గైకొనినయెడల ఆయన ప్రేమయందు నిలిచియుందుము
యోహాను 15:70.

దేవుని ప్రేమయందు నిలిచియుండువారు పొరుగువాని కూ
తమ్మును వలె ప్రేమించగలరు.

7. దేవుని మార్గముల యందు నమ్మకమైన రీతిగా నడవా
కుయుక్తిగా నడుచుకొనకయు, దేవుని వాక్యమును వంచనగా
బోధింపకయు; (II కొరింథి 4:2). పిలువబడిన పిలుపునకు త
యోగ్యమైన రీతిని నడచుకొనుచు దేవుని మహిమ పరచవలెను

ఈ విధంగ హెబ్రీ 11 అధ్యాయములోని అనేకమంది యోగ్యులైనవారు విశ్వాసము ద్వారా జీవించుచు దేవునిని వెంబడించిరి. హేబెలు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపు, మోషే మున్నగు వారందరు విశ్వాస జీవితములో ఎన్నదగినవారు. వినుటవలన విశ్వాసము కలుగును. వినుట దేవుని వాక్యమువలన కలుగును. రోమా 10:17.

దేవుని వాక్యానుసారముగ జీవించిన మనము విశ్వాస జీవితమును జీవించగలము. అట్లుగాక మానవుని మార్గముల ననుసరించిన మనము దేవుని సంతోషపెట్టలేము. తుదకు అది మరణమునకు దారి తీయును. సామెతలు 14:12.

దేవుడు తన బిడ్డలుగా యుండుటకు పిలిచిన ఈ పిలుపునకు లోబడి ఆయన మహిమకొరకు యోగ్యమైనట్టి రీతిగ జీవించుటకు దేవుడు తన కృపను మనకందరకు మెండుగ అనుగ్రహించును గాక. — జెస్సీ జేసన్.

---

## డార్విన్ అనుచరుల జవాబేమి?

పరిణామ సిద్ధాంతములో కాలమునకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడెను. యిందు కాలము ముఖ్యపాత్ర వహించెను. ఈ అనంత కాలగమనములో ఏ శక్తి ప్రమేయము లేకుండ కాలము అసాధ్యమైన విషయములను జరిగించెననునదియే పరిణామ సిద్ధాంత సారాంశము. మనము వేచి చూచినయెడల కాలము దానికదే అద్భుత కార్యములను జరిగించునా? కాలమునకు సృజించు శక్తిగాని అభివృద్ధిచేయు శక్తిగాని లేదు. కాని పరిణామ సిద్ధాంతీకులు కాలమే సృష్టి నంతటిని అభివృద్ధి పరచెనని నమ్ముచున్నారు.

5 లక్షల కోట్ల (5 బిలియన్ల) సంవత్సరముల క్రిందట భూమి ఏర్పడెనని పరిణామ సిద్ధాంతీకుల అభిప్రాయము. జీవపదార్థము ఉద్భ

వించి సుమారు 2 లక్షల కోట్ల (2 బిలియన్ల) సంవత్సరము లైనదని చెప్పుచున్నారు. దీనినిబట్టి భూమి ప్రారంభమునకు మానవుని ప్రారంభ మునకు మధ్య కొన్ని బిలియన్ల సంవత్సరములున్నవి. ఈ చరిత్ర అంతయు 19వ శతాబ్దములో వ్రాసినదే. 19వ శతాబ్దమునకు ముందు అనగా డార్విన్‌కు ముందు పరిణామ సిద్ధాంతము లేదు. వీరు ఈ కాల మంతటిని 4 యుగములుగ విభజించిరి. (1. Pre-Cambrian, 2. Paleozoic, 3. Mesozoic, 4. Cenozoic). జీవపదార్థ మున్న స్థితినిబట్టి ఒక్కొక్క యుగమును కొన్ని భాగములుగ విభజించిరి.

జీవరాసుల పరిణామ క్రమము సంపూర్ణముగ వ్రాయుటలో డార్విన్ విఫలుడయ్యెను. జీవరాసుల పరిణామ దశలన్నిటిని గూర్చి డార్విన్ చెప్పలేకపోయెను. ఉదాహరణకు వృక్షములకు, మానవులకు మధ్యనున్న అగాధమును కలుపుటకు 'లింకు'లు గాని నమూనాలుగాని సేకరించలేకపోయిరి. ఒక కపాలమును, ఎముకను చూపి యిదే కోతికి మానవునికి మధ్యనున్న 'లింకు' అని చూపుచున్నారు.

పరిణామము చెందిన మానవునికి - కాలమే భాష నేర్పెనా! బిడ్డకు పాలిచ్చి పెంచుటకు తల్లికి ప్రత్యేక అవయవ నిర్మాణమును ఏర్పాటు చేసినది కాలమా? ఆ పాలలో పసికందుకు కావలసిన పోషక పదార్థములన్నియు ఉంచిన దెవరు? తల్లికి బిడ్డపై నున్న ఆ ప్రేమాను రాగాలను కాలమే యిచ్చినదని డార్విన్ చెప్పినపుడు మీ అభి ప్రాయ మేమి?

మానవునికి అవసరమైన వన్నియు కాలమే అనుగ్రహించెనను సిద్ధాంతముకంటె హాస్యము మరొకటి లేదు.

"కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచు కొని యున్నాడు" (అ.కార్య 1:7).

— E.K.V. ప్రసాదరావు, చెయ్యేరు

# యాకోబు చేసిన పొరపాటు

(ఆది 42 : 31-38).

"ఇవన్నియు నాకు ప్రతికూలముగా వున్నవి (ఆది 42:36).

ఈ మాటలు నిరాశలో వుండి, పరిస్థితులన్నీ ప్రతికూలంగా వున్నాయని భావించిన యాకోబు అన్నవి. నిజానికి పరిస్థితులు ప్రతికూలంగా కాక, ఒక మహిమకరమైన ముగింపుకు వస్తున్నాయి. చనిపోయాడు అనుకొంటున్న యోసేపుతో యాకోబు కలవబోతున్నాడు.

ప్రతికూల పరిస్థితుల్లోంచే మంచి పుడుతుందని అనేకుల నమ్మకం. ఉదాహరణకు బీథూవెన్ తన వినికిడి శక్తిని కోల్పోయినాకే అతని సమర్థత బయటపడింది. అతను చెవిటివాడై యున్నప్పుడే శ్రావ్యమైన సంగీతాన్ని రచించాడు. లూయీ పాశ్చర్ తన జీవితాన్ని కుదించేంత దెబ్బ తగిలిన తరువాత గొప్ప పరిశోధనలు చేశాడు. జాన్ మిల్టన్ గుడ్డివాడుగా ఉన్నప్పుడే అతి ఉత్తమ కావ్యాలను వ్రాశాడు. విలియం కూపర్ మతి స్థిమితం లేక బాధపడేవాడు. కాని ఆకాలంలోనే ఆయన గొప్ప కీర్తనలు వ్రాశాడు. అన్నీ జాన్సన్ ఫ్లింట్ గారి పద్యాలు ఆమె లోతైన బాధల్లో వున్నప్పుడే వ్రాసింది. అలాంటి బాధలు పడకుండానే వారు అలాటి గొప్పపనులు చేశారా ?

తన భక్తు·కు తనను గురించి తెలియజేసి, వారి హృదయాలకు మేలుకలుగ జేయటంకోసం, దేవుడు వారిని అనారోగ్యపు పడకపై పడుండబెడతాడు, లేదా వారి ప్రియులను పరలోకానికి కొనిపోతాడు. దేవుని జ్ఞానాన్ని సందేహించిన యాకోబు పొరపాటును నీవూ చేయవద్దు. శత్రుత్వపు అగ్నిలోనే దేవుడు తన బంగారాన్ని శుద్ధి చేస్తాడు.

"ఏళ్లు గడచిపోతూంటే గమనించాను, గతాన్ని వెనుకే వదలివేశాను
నేను విచారం అనుకొన్నది దేవుని దయ అని ఋజువైనది" -Anon.

మనం 'ప్రతికూలం' అని పిలిచేదాన్ని దేవుడు 'అవకాశం' అని పిలుస్తాడు. మనం 'శ్రమ' అనుకొనేదాన్ని దేవుడు 'అభివృద్ధి' అంటాడు.

—N. రహంతుల్లా, నెల్లూరు.

# అబద్ధ జ్ఞానము

## *(Pseudo-science)*

సైన్సు అను పదము లాటినుభాష నుండి ఉత్పన్నమైనది. ...
జ్ఞానము, వాస్తవము అను అర్థములున్నవి. గనుక వాస్తవముగా ...
పించబడినదే సైన్సు. సిద్ధాంతము (**theory**) సైన్సు కాదు. ...
వాస్తవమే (**fact**) సైన్సు. నేడు సైన్సు అను పదము అవాస్త...
విషయాలకు వాడబడుచున్నది.

1900 సం॥లకు క్రితమే పరిశుద్ధాత్మ ప్రేరితుడైన పౌలు ...
పత్రికలో తిమోతికి వ్రాయుచు, "సూడో న్యూమో గ్నోసిస్" ...
మాటను వాడెను. అది "జ్ఞానమని చెప్పబడు అబద్ధము" అని తెని...
బడినది. నేటి లోకములో సైన్సు అను పదము దుర్వినియోగప...
బడుచున్నది.

గనుక బైబిలుతో ఏకీభవించని ఎట్టి సిద్ధాంతములనైనను, ప...
టనలనైనను క్రైస్తవులు నమ్మవలదని పరిశుద్ధాత్ముడు హెచ్చరి...
చున్నాడు: "......జ్ఞానమని అబద్ధముగా చెప్పబడిన విపరీత వాద...
లకు దూరముగా ఉండుము. ఆ విషయములో ప్రవీణులమని కొం...
రనుకొని విశ్వాస విషయములో తప్పిపోయిరి" (1 తిమోతి 6:20, 21)

—ప్రభు...

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

To
..............................
..............................
..............................
..............................